


వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 078
పేజీలు : 06 | వెల: రూ.5/-
సోమవారం
మార్చి 09, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



# 'డెత్ జోన్'గా గుడెప్పాడు జంక్షన్




అది మూడు రాష్ట్రాల వారధి.. వేలాది వాహనాల రాకపోకలకు వేదిక.. కానీ దురదృష్టవశాత్తూ అదే ఇప్పుడు మృత్యువుకు చిరునామాగా మారింది. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం గూడెప్పాడు జంక్షన్ వద్ద ప్రయాణమంటేనే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం, అస్తవ్యస్తమైన పార్కింగ్ పర్యవసానంగా ఈ కూడలి 'డెత్ జోన్'గా మారుతోంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపే ప్రధాన రవాణా మార్గమిది. నిత్యం వేలాది భారీ వాహనాలు, లారీలు ఈ జంక్షన్ గుండా ప్రయాణిస్తుంటాయి. దీనికి తోడు ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మేడారం, ప్రకృతి రమణీయతకు నిలయమైన లక్నవరం, పారిశ్రామిక ప్రాంతమైన కోల్ బెల్ట్, ఇంజనీరింగ్ అద్భుతం కాళేశ్వరం వెళ్లే పర్యాటకులకు కూడా ఇదే ప్రధాన మార్గం. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రహదారిపై భద్రత మాత్రం శూన్యం.

- వరంగల్ వాయిస్, ఆత్మకూరు



వివరాలు2లో..

- నిత్యం నెత్తురోడుతున్న రహదారి
- 100 ఫీట్ల రోడ్డున్నా తప్పని ముప్పు
- మూలమలుపుల్లో అడ్డంగా లారీలు
- అస్తవ్యస్తంగా జంక్షన్
- వందల ప్రాణాలు బలిగొన్న కూడలి



6లో..

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూల మలుపు వద్ద రోడ్డు విస్తరణ చేయాలి

కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



2లో..

## విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తాం

- కలెక్టర్ దివాకర టి.ఎస్.
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్..
- బస్టాండ్ నిర్మాణ పనుల పరిశీలన



3లో..

## వ్యవసాయ యాంత్రీకరణతోనే రైతుకు మేలు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి




## 'ఆరోగ్యమే మహాభాగ్యం'

- వరంగల్ కలెక్టర్ సత్య శారద

'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నినాదంతో నగర ప్రజల్లో ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన కల్పించేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం భారీ '5కే రన్' నిర్వహించారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన ఈ ర్యాలీని పోచమ్మ మైదాన్ జంక్షన్ నుంచి హనుమకొండ వెయ్యి స్థంభాల గుడి వరకు ఉత్సాహంగా కొనసాగించారు. నగర మేయర్ గుండు సుధారాణి, హన్మకొండ మరియు వరంగల్ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్‌పాయ్లు ఈ ర్యాలీలో స్వయంగా పాల్గొని యువతను, ప్రజలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల ప్రతినిధులు మరియు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. – వరంగల్ వాయిస్, వరంగల్



# ‘డెత్ జోన్’గా గూడెప్పాడు జంక్షన్

- నిత్యం నెత్తురోడుతున్న రహదారి!
- 100 ఫీట్ల రోడ్డున్నా తప్పని ముప్పు
- మూలమలుపుల్లో అడ్డంగా లారీలు..
- అస్తవ్యస్తంగా జంక్షన్..
- వందల ప్రాణాలు బలిగొన్న అస్తవ్యస్త కూడలి..

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** అది మూడు రాష్ట్రాల వారధి.. వేలాది వాహనాల రాకపోకలకు వేదిక.. కానీ దురదృష్టవశాత్తూ అదే ఇప్పుడు మృత్యువుకు చిరునామాగా మారింది. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం గూడెప్పాడు జంక్షన్ వద్ద ప్రయాణమంటేనే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం, అస్తవ్యస్తమైన పార్కింగ్ పర్యవసానంగా ఈ కూడలి ‘డెత్ జోన్’గా మారుతోంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపే ప్రధాన రవాణా మార్గమిది. నిత్యం వేలాది భారీ వాహనాలు, లారీలు ఈ జంక్షన్ గుండా ప్రయాణిస్తుంటాయి. దీనికి తోడు ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మేడారం, ప్రకృతి రమణీయతకు నిలయమైన లక్నవరం, పారిశ్రామిక ప్రాంతమైన కోల్ బెల్ట్, ఇంజనీరింగ్ అద్భుతం కాళేశ్వరం వెళ్లే పర్యాటకులకు కూడా ఇదే ప్రధాన మార్గం. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రహదారిపై భద్రత మాత్రం శూన్యం.

### అడ్డగోలు పార్కింగ్..

హనుమకొండ, పరకాల, ములుగు వైపు వెళ్లే రహదారులను ప్రభుత్వం 100 ఫీట్ల మేర వెడల్పు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదు. రోడ్డుకు ఇరువైపులా భారీ లారీలను ఇష్టారాజ్యంగా నిలపడం శాపంగా మారింది. పరకాల, భూపాలపల్లి వైపు వెళ్లే మలుపుల వద్దే భారీ వాహనాలను నిలపడంతో, మలుపు తిరిగే వాహనాలకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో రోడ్డు పక్కన ఆపి ఉన్న లారీలను గమనించక ద్విచక్ర వాహనదారులు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికే ఇక్కడ వందల సంఖ్యలో ప్రమాదాలు జరిగి, ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడ్డాయి.

### శాస్త్రీయ పద్ధతిలో జంక్షన్ డిజైన్ చేయాలి..

ఈ జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని బాధితులు మరియు స్థానికులు వేడుకుంటున్నారు. జంక్షన్ వద్ద వాహనాలు సాఫీగా వెళ్లేందుకు ‘ఫ్రీ లెఫ్ట్’ సౌకర్యం కల్పించాలి. ఇరుకైన మలుపులను సరిదిద్ది, శాస్త్రీయ పద్ధతిలో జంక్షన్ డిజైన్ చేయాలి. కూడలికి సమీపంలో భారీ వాహనాలు నిలపకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలి. ప్రజా ప్రతినిధులు, రోడ్డు భవనాల శాఖ , నేషనల్ హైవే అధికారులు తక్షణమే స్పందించి గూడెప్పాడు జంక్షన్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని, లేదంటే ఈ మృత్యుఘోష ఇలాగే కొనసాగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రమాదంలో నాభార్యను కోల్పోయా...

**- బలభద్ర దినేష్, బాధితుడు**



సంవత్సంరం క్రితం గూడెప్పాడ్ గ్రామానికి చెందిన నేను, నా భార్య భవాని, కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గూడెప్పాడ్ జంక్షన్ వద్ద లారీ సడెన్ గా మూలమలుపు తిరగడంతో పక్కన వెళ్తున్న మా ద్విచక్ర వాహనం పైనుంచి లారీ వెళ్లింది . బైక్ పై ఉన్న భవాని లారీ చక్రాల కింద పడటంతో తీవ్ర రక్తస్రావమై నడుము భాగం మొత్తం ఛిద్రమైంది. కుమారుడికి తీవ్ర గాయాలు కాగా, దినేష్ స్వల్ప గాయాలతో తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే కొన ఊపిరితో ఉన్న భవానిని ఆత్మకూరు సీఐ సంతోష్, పరిస్థితి తీవ్రతను గమనించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా గ్రామస్తుల సహాయంతో క్షతగాత్రులను తన సొంత వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే భవాని మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో ఒక కుటుంబానికి ఆడ దిక్కు లేకుండా పోవడంతో పాటు ఒక పసిగుడ్డు తల్లిలేని వాడిగా మిగిలాడు. ఈ ప్రమాదం లాంటి ఘటనలు గతంలో ఎన్నో జరిగాయి.

## మరో ప్రమాదం జరగొద్దు

**- భయ్యా నరేష్ , భాదితుడు**



గూడెప్పాడు జంక్షన్ ప్రమాదాలకు అడ్డాగా మారిందని, ఇక్కడ సరైన ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడం వల్ల ఎన్నో కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోతున్నాయని తన తల్లిని ప్రమాదంలో కోల్పోయిన బాధితుడు భయ్యా నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సెంటర్ వద్ద వాహనాల రద్దీ దృష్ట్యా వెంటనే ‘ఫ్రీ లెఫ్ట్’ ఏర్పాటు చేసి, జంక్షన్‌ను అభివృద్ధి చేయాలి. రోడ్డు పక్కన లారీలు ఇష్టానుసారంగా ఆగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, మలుపుల వద్ద లారీలు ఆగడం వల్లే ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ సెంటర్ వద్ద నిరంతరం ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ ఉండాలని డిమాండ్ చేశారు. “మరో ప్రాణం పోకముందే ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించాలని, గూడెప్పాడు జంక్షన్‌లో శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



## ఆయిల్ పామ్, అరటి సాగుతోనే రైతులకు అధిక లాభాలు

**వరంగల్ వాయిస్, దామెర :** సాంప్రదాయ పంటలకు భిన్నంగా రైతులు ఆయిల్ పామ్, అరటి వంటి తోటలను సాగు చేయడం ద్వారా తక్కువ శ్రమతో అధిక లాభాలను పొందవచ్చని ఉద్యానవన శాఖ అధికారి బి.మానస అన్నారు. సోమవారం దామెర మండలంలోని ఊరుగొండ గ్రామంలో రైతు వెంకటరెడ్డి ఆయిల్ పామ్ తోటలో రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారిణి మానస మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగులో రైతులు పాటించాల్సిన ఆధునిక పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరించారు. హైదరాబాద్ మల్లారెడ్డి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అమల మాట్లాడుతూ.. అరటి సాగులో నూతన పద్ధతులు, వేసవిలో సస్యరక్షణ చర్యలు, గెలల ప్యాకింగ్, అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ మెళకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఊరుగొండ సర్పంచ్ పోలేపాక శ్రీనివాస్, ఉప సర్పంచ్ నంద్యాల శ్రావణ్ రెడ్డి, దమ్మన్నపేట సర్పంచ్ దుబాసి నవీన్, ఉద్యాన అధికారి దేవేందర్ పాల్గొన్నారు. అలాగే రామ్ చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ అధికారులు ప్రవీణ్, అరుణ్, రంజిత్, రైతులు వైకుంఠం, వంచా రవీందర్ రెడ్డి, గంకిడి సాంబరెడ్డి, ఏదుల్లా విజేందర్ రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


## విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తాం

- కలెక్టర్ దివాకర టి.ఎస్.
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్..
- బస్టాండ్ నిర్మాణ పనుల పరిశీలన

**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ‘ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక’లో భాగంగా సోమవారం ఆయన ములుగు మండలం ఇంచర్ల శివారులోని ఎర్రిగట్టమ్మ వద్ద గల గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మరియు కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ విద్యార్థుల వసతి గదులు, స్టోర్ రూమ్, కిచెన్ షెడ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేశారు. భోజన నాణ్యత, తరగతుల నిర్వహణ మరియు ఉపాధ్యాయుల బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారమే పౌష్టికాహారం అందించాలని వార్డెన్‌ను ఆదేశించారు. చదువుతో పాటు క్రీడలు, సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఆర్టీసీ బస్టాండ్ పనులను కలెక్టర్ సందర్శించారు.



నిర్మాణ మ్యాపును పరిశీలించి, పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, గడువులోగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, హాస్టల్ వార్డెన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఐపీఎస్‌కు ఎంపికైన అఖిలేష్‌కు సన్మానం

**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** యూపీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటి ఆల్ ఇండియా 464వ ర్యాంకుతో ఇండియన్ పోలీస్ సర్వీస్ కు ఎంపికైన హన్మకొండ జిల్లా న్యూ శాయంపేట వాస్తవ్యుడు గుండు అఖిలేష్ ను తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా విభాగం ఘనంగా అభినందించింది. సోమవారం ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో సంఘం నేతలు అఖిలేష్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అఖిలేష్ విజయం పద్మశాలి సామాజిక వర్గానికి వరంగల్ జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోడం రవి ప్రకాష్, జనరల్ సెక్రటరీ గుర్రపు రాజమౌళి, కోశాధికారి బూర తిరుపతయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ కొండ శ్రీనివాస్, కొండబత్తుల రాజేందర్ పాల్గొన్నారు.

# వ్యవసాయ యాంత్రీకరణతోనే రైతుకు మేలు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- 50 శాతం సబ్సిడీతో పనిముట్ల పంపిణీ
- స్వామినాథన్ కమిషన్ నివేదిక అమలుకు డిమాండ్



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతులను అవలంబించాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. సోమవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హనుమకొండ జిల్లా పరిధిలోని ధర్మసాగర్, వేలేరు మండలాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీపై రోటవేటర్లు, బేయిలర్లు, స్ప్రేయర్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడి భారాన్ని తగ్గించి, సాగును లాభసాటిగా మార్చేందుకే ప్రభుత్వం యాంత్రీకరణను ప్రోత్సహిస్తోందని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ, సన్నాలకు బోనస్, ఉచిత విద్యుత్ మరియు నాణ్యమైన విత్తనాల సరఫరా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. కేవలం వరి సాగుకే పరిమితం కాకుండా, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు. అలాగే పాడి, పౌల్ట్రీ వంటి అనుబంధ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ధర్మసాగర్, వేలేరు మండలాలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడినందున, సబ్సిడీ యంత్రాల కేటాయింపులో ఈ ప్రాంతాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించారు. డ్రోన్ స్ప్రేయర్లను వ్యక్తులకు కాకుండా రైతు సంఘాలకు లేదా మహిళా సంఘాలకు గ్రామానికి ఒకటి చొప్పున కేటాయించాలని సూచించారు. వ్యవసాయం లాభసాటిగా మారాలంటే స్వామినాథన్ కమిషన్ నివేదికను యథాతథంగా అమలు చేయాలని కడియం శ్రీహరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా, రైతు పండించిన పంట చేతికి వచ్చే వరకు భరోసా లేని పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఏడిఏవో, ఏవోలు, స్థానిక సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కూసం రాజమౌళికి జిల్లా యంత్రాంగం ఘన నివాళి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రామ పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, గంగదేవిపల్లిని దేశ పటంలో ఆదర్శ గ్రామంగా నిలిపిన మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి పార్థివ దేహానికి జిల్లా యంత్రాంగం తరఫున సోమవారం ఘన నివాళులర్పించారు. రాజమౌళి మృతి పట్ల జిల్లా అధికారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వై.వి. గణేష్, జిల్లా పరిషత్ సీఈఓ రామ్ రెడ్డిలు రాజమౌళి నివాసానికి చేరుకుని, ఆయన పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిలో ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. గ్రామాభివృద్ధి, సుస్థిర గ్రామ పాలనలో రాజమౌళి చూపిన చొరవ అసాధారణమని, ఆయన కృషి ప్రతి ప్రజాప్రతినిధికి ఆదర్శప్రాయమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని కన్నీటి నివాళులర్పించారు.

## కూసం రాజమౌళి మృతిపై కడియం కావ్య సంతాపం



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** వరంగల్ జిల్లా గంగదేవిపల్లి గ్రామ మాజీ సర్పంచ్, ఆదర్శ గ్రామ రూపశిల్పి కూసం రాజమౌళి మరణం పట్ల వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి గంగదేవిపల్లి గ్రామానికే కాకుండా జిల్లా మొత్తానికి తీరని లోటు అని పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్యానికి నిజమైన అర్థం తీసుకొచ్చి, గంగదేవిపల్లిని దేశానికే ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేయడంలో రాజమౌళి గారు కీలక పాత్ర పోషించారని ఎంపీ కొనియాడారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ.. గంగదేవిపల్లి నమూనాను అధ్యయనం చేసేందుకు దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఇక్కడికి వచ్చే స్థాయికి గ్రామాన్ని తీసుకెళ్లిన ఘనత ఆయనదేనని గుర్తు చేసుకున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో రాజమౌళి గారు చేసిన సేవలు ఎల్లప్పుడూ చిరస్మరణీయంగా ఉంటాయని ఎంపీ తెలిపారు. రాజమౌళి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి మరణంతో శోకసంద్రంలో మునిగిన కుటుంబ సభ్యులకు డాక్టర్ కడియం కావ్య తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## కేజీబీవీ, సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

☐ టీఎస్ యూటీఎఫ్ డిమాండ్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ (యూఆర్ఎస్) సమగ్ర శిక్షా అభియాన్ లో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేసి, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ చేపట్టిన దశలవారీ పోరాటంలో భాగంగా సోమవారం నేరడ కేజీబీవీ పాఠశాల వద్ద భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా షేక్ యాకూబ్ మాట్లాడుతూ.. గత ఏడాది 29 రోజుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రితో జరిగిన చర్చల్లో అంగీకరించిన అంశాలను ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఈ సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో మార్చి 16న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ధర్నాలు, మార్చి 20న 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డులో కనీస వేతనాలకు సరిపడా నిధుల ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు పోలోజు మంజుల, స్పెషల్ ఆఫీసర్ సరస్వతి, ఉపాధ్యాయులు స్వరూప, సుహాసిని, వనిత, కళావతి, సింధుజ, రాజశ్రీ, విజయ తదితరులు పాల్గొన్నారు.

## దామెర శివాలయంలో చోరీ

☐ వెండి శఠగోపురం, పళ్లెం అపహరణ

**వరంగల్ వాయిస్ దామెర :** మండల కేంద్రంలోని శివాలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు, సుమారు 60 వేల రూపాయల విలువైన వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఆదివారం రాత్రి సమయంలో గుర్తుతెలియని దొంగలు దామెర గ్రామ పరిధిలోని శివాలయం ప్రధాన ద్వారం తాళం పగలగొట్టారు. గర్భాలయంలో ఉన్న సుమారు 60 వేల విలువ గల వెండి శఠగోపురం, వెండి పళ్లెంను దొంగిలించారు. సోమవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి, లోపల వస్తువులు మాయమైనట్లు గుర్తించారు. ఆలయ పూజారి గుమ్మడవెల్లి సుబ్బరాయ శాస్త్రి ఫిర్యాదు మేరకు దామెర ఎస్సై కొంక అశోక్ సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై తెలిపారు. ఆలయాల్లో భద్రతా చర్యలు పెంచాలని స్థానికులు ఈ సందర్భంగా కోరుతున్నారు.



## ఎర్రబెల్లి స్వర్ణకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన ఎర్రబెల్లి స్వర్ణను సోమవారం హసన్‌పర్తి మండల మహిళా కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని ఆమె నివాసంలో కలిసిన నాయకులు, స్వర్ణకు పూలబొక్కే అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, పెంబర్తి గ్రామ ఉపసర్పంచ్ జోరుక పూల మాట్లాడుతూ.. ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీతంపేట గ్రామ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుర్రాల స్వప్న, అనంతసాగర్ గ్రామ అధ్యక్షురాలు చెల్పూరి జమున తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో దరఖాస్తుదారుల సమక్షంలోనే చర్చించారు. ప్రజావాణిలో అందిన వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 113 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, హౌసింగ్ పీడీ శ్రీవాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డీసీఓ నీరజ, డీబీసీడీఓ పుష్పలతతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, మార్చి 09, 2026



# గట్లకానిపర్తిలో మెగా వైద్య శిబిరం సక్సెస్

□ డాక్టర్లకు, మహిళలకు సన్మానం

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఆదివారం భారీ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, హనుమకొండ శ్రీనివాస హాస్పిటల్, స్థానిక గ్రామ పంచాయతీ, డ్వాక్రా మహిళా సంఘాలు, గ్రామ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక సర్పంచ్ వైనాల విజయ, ఉప సర్పంచ్ ఒంటెల లావణ్య జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. కుటుంబాన్ని చక్కదిద్దడంలోనే కాకుండా, దేశాభివృద్ధిలో మహిళల పాత్ర అమూల్యమైనదని వారు పేర్కొన్నారు. "మహిళలు ఇంటి దీపాలని, తల్లిగా, చెల్లిగా, భార్యగా వారు పంచే ప్రేమ, చేసే కృషి వల్లే కుటుంబాలు సంతోషంగా ఉంటున్నాయి" అని వారు అభిప్రాయపడ్డారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి పైగా గ్రామస్థులు వైద్య పరీక్షలు చేయించుకుని, ఉచితంగా మందులు పొందారు. హనుమకొండ శ్రీనివాస హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు రోగులకు సేవలందించారు. డాక్టర్ ముప్పిడి విశ్వభరత్ రెడ్డి (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ గట్ల నాగ సామ్రాట్ (జనరల్ సర్జన్), డాక్టర్ సాయి చరణ్ రెడ్డి (ఆర్థోపెడిక్), డాక్టర్ ఎస్.కావ్య (స్త్రీల వైద్య నిపుణులు), డాక్టర్ ఎస్.రాకేష్ (పిల్లల వైద్య నిపుణులు), శాయంపేట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సాయి కృష్ణ, డాక్టర్ అపర్ణ, డాక్టర్ వినోద్, పారామెడికల్ సిబ్బంది కూడా ఈ శిబిరంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సేవా కార్యక్రమంలో గ్రామ శ్రేయోభిలాషులు ముప్పిడి కృష్ణార్జున రెడ్డి, గడ్డం కేశవమూర్తి, మార్త భిక్షపతి, అనంతల సారంగపాణి, న్యాయవాది ఒంటేరు చంద్రమౌళి పాల్గొన్నారు. అలాగే గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బొమ్మకంటి ముత్యాలు, ఉపాధ్యక్షులు నాగరాజు, సముద్రాల లింగమూర్తి, నరెడ్ల రాంబాబు, ఇతర సభ్యులు మరియు శ్రీనివాస హాస్పిటల్ సిబ్బంది సందీప్, కార్తీక్, రాము పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






# గ్రానైట్ క్వారీకి అడ్డంకులు తొలగించండి

□ కలెక్టర్ కు బొల్లపల్లి కృష్ణ వినతి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల అనుమతులు పొందినప్పటికీ, తన గ్రానైట్ క్వారీ నిర్వహణకు కొందరు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారని కోమల్లా గ్రామానికి చెందిన బొల్లపల్లి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రఘునాథపల్లి మండలం కోమల్లా గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 48లో గల "ఇరన్న గుట్ట" ప్రభుత్వ భూమిలో కలర్ గ్రానైట్ క్వారీ కోసం 2013 నుంచి తాను నిరంతర పోరాటం చేస్తున్నానని కృష్ణ పేర్కొన్నారు. ఈ క్రమంలో తనకు లభించిన చట్టబద్ధమైన అనుమతులను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 2014 ఫిబ్రవరి 26న గ్రామసభ నిర్వహించి, ఎటువంటి అభ్యంతరాలు లేవని పంచాయతీ ద్వారా ఎన్‌ఓసీ పొందినట్లు తెలిపారు. అప్పటి రఘునాథపల్లి తహశీల్దార్, ఆర్డీఓ, జిల్లా డిప్యూటీ సర్వేయర్లు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపి 2015లో అనుమతులు మంజూరు చేశారని వివరించారు. ఉమ్మడి జిల్లా డీఎఫ్ఓ, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ వారు 10 ఎకరాల భూమిలో 20 ఏళ్ల పాటు క్వారీ నిర్వహించుకునేందుకు 'ఫైనల్ గ్రాంట్ ఆర్డర్' ఇచ్చారని, అలాగే 2015 సెప్టెంబర్ 7న పర్యావరణ అనుమతులు (కూడా లభించాయని తెలిపారు. ఇంతటి సుదీర్ఘ ప్రక్రియ పూర్తి చేసి, లక్షలాది రూపాయలు వెచ్చించి క్వారీ ప్రారంభించడానికి సిద్ధమవుతుంటే, కొందరు వ్యక్తులు అక్రమంగా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ పరంగా తనకు రక్షణ కల్పించి, క్వారీ నిర్వహణకు సహకరించాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

# వైభవంగా సుదర్శన చక్ర చరప్రతిష్ఠ

□ పాల్గొన్న డాక్టర్ కీర్తి రెడ్డి

**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్థానిక శ్రీ సీతారామాంజనేయ, రాధా వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సుదర్శన చక్ర చరప్రతిష్ఠ మహోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన కీర్తి రెడ్డికి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి కూడా ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు నవీన్ రావు, రాజశేఖర్ బనగాని, వేముల రమేష్, దుగ్గిశెట్టి పున్నం చందర్, ఆలయ కమిటీ చైర్మన్ బోయినపల్లి హన్మంత్ రావు, పిన్నింటి మణదీప్ రావు, మాధవ రావు, కోల రవీందర్, అడుప సారంగం, విజయ్ నరసింగరావు పాల్గొన్నారు. అలాగే బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిఫ్, రేగొండ మండల ఉపాధ్యక్షులు శివకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనివ్వాలి

**- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**




**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, వాటిని వెంటనే పరిష్కరించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సిహెచ్. మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ రోజు జరిగిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 49 దరఖాస్తులు అందాయి. వాటిలో భూ సంబంధిత సమస్యలు: 17, పెన్షన్లు: 15, ఇతర శాఖల ఫిర్యాదులు: 12, ఇందిరమ్మ ఇండ్లు: 03, ఉద్యోగ కల్పన: 02గా ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో వెంటనే పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలకు పరామర్శ

**వరంగల్ వాయిస్, పరకాల :** మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరకాల మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. పరకాల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బొంపల్లి విజేందర్ రావు కుమారుడు బొంపల్లి ప్రశాంత్ రావు అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న చల్లా ధర్మారెడ్డి సోమవారం వారి నివాసానికి చేరుకున్నారు. ప్రశాంత్ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పుత్రశోకంతో ఉన్న విజేందర్ రావు కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మండలంలోని పోచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దార రామచంద్రయ్య ఇటీవల మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామచంద్రయ్య చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం, ఆయన మరణానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యూత్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కోటగుళ్లలో ఎస్ఐ హేమలత పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచే చారిత్రక సంపద, ప్రసిద్ధిగాంచిన భవానీ సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు) లో ఆదివారం చిట్యాల పోలీస్ స్టేషన్ రెండో ఎస్ఐ హేమలత స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎస్ఐ హేమలతకు అర్చకులు జూలపల్లి నాగరాజు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు ఆమెను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. లోక కల్యాణం కోసం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఈ సందర్భంగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతతోనే సమాజ వికాసం

- ది ఆక్సెంట్ర ఈవెంట్స్ వేడుకల్లో ప్రముఖులు
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళలు తమపై తాము నమ్మకం ఉంచి, ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తే ఏ రంగంలోనైనా అద్భుతాలు సృష్టించగలరని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. 'ది ఆక్సెంట్ర ఈవెంట్స్' మేనేజింగ్ డైరెక్టర్ వి. స్రవంతి ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విమెన్ అండ్ చైల్డ్ రైట్స్ యాక్టివిస్ట్ డాక్టర్ మమత ఆచంట, మాజీ ఇండియన్ క్రికెటర్ సునీత ఆనంద్, ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి ఎం. అనూహ్య నాయుడు, ఫ్యామిలీ కౌన్సిలర్ కవిత బోధనం, తత్వది స్కూల్ ఫౌండర్ పి. అనిత రెడ్డి, డాక్టర్ జి. సుధారాణి హాజరై జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. విద్య, వైద్యం, క్రీడలు, కళలు మరియు వ్యాపార రంగాల్లో మహిళలు తమదైన ముద్ర వేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని వక్తలు కొనియాడారు. కుటుంబ అభివృద్ధిలోనే కాక, దేశ ప్రగతిలోనూ మహిళల పాత్ర వెలకట్టలేనిదని, యువతులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. మహిళలు ఒకరికొకరు తోడ్పాటుగా నిలిచినప్పుడే సామాజిక మార్పు వేగవంతం అవుతుందని, ఆరోగ్యం, భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు మహిళలను అతిథులు శాలువాలతో సత్కరించి, మెమెంటోలను అందజేశారు. "మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, వారికి సరైన వేదికను కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. భవిష్యత్తులో మహిళా సాధికారత కోసం మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడతామని వి. స్రవంతి, ఎండీ, ది ఆక్సెంట్ర ఈవెంట్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.



## మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహిళలు కేవలం చదువు, అధికారంతోనే కాకుండా, సొంతంగా నిర్ణయాలు తీసుకోగలిగే శక్తిగా ఎదిగినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని అఖిల భారతీయ జైన్ మహిళా పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు కౌల మౌనిక జైన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం ఆమె ఆధ్వర్యంలో డోర్నకల్ మండల కేంద్రంలో భారీ మారథాన్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ కూడలి వరకు ఈ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. అనంతరం రైల్వే బుకింగ్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మౌనిక జైన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జైన్ మహిళా పరిషత్ మండల అధ్యక్షురాలు సుశీల జైన్, కార్యదర్శి భారతీ జైన్, కోశాధికారి వినిత జైన్ పాల్గొన్నారు. అలాగే కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్ మున్నిబేగం, జెడ్పీ స్కూల్ హిందీ టీచర్ కలపాల అనిత, బ్రిల్లియంట్ స్కూల్ ప్రిన్సిపాల్ అప్సరా బేగం, నిర్మల స్కూల్ టీచర్ పుష్ప, మాజీ కౌన్సిలర్ తేజావత్ సంధ్య తదితరులు పాల్గొని మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను చాటారు.

# మహిళలు సమాజ పురోగతికి శక్తిస్తంభాలు

☐ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు



**వరంగల్ వాయిస్, హనుమకొండ (నక్కలగుట్ట) :** కుటుంబ వ్యవస్థను నిలబెట్టే శక్తి మహిళలదేనని, సమాజ అభివృద్ధి, దేశ ప్రగతిలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు కొనియాడారు. సోమవారం నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి డైరెక్టర్లు వి. మోహన్ రావు, వి. తిరుపతి రెడ్డి, టి. మధుసూదన్, సి. ప్రభాకర్లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసి మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. సంస్థలో మహిళా ఉద్యోగులందరికీ సముచిత గౌరవం కల్పిస్తున్న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డికి ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళల భద్రత, గౌరవం, సాధికారత సమాజ పురోగతికి అత్యంత అవసరమని, ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో తన కలలను సాకారం చేసుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో సీఈలు టి. సదర్ లాల్, కె. రాజు చౌహాన్, అన్నపూర్ణ, సురేందర్, మాధవ రావు, వెంకట రమణ, శ్రవణ్ కుమార్, సీజీఎంలు రవీంద్రనాథ్, చరణ్ దాస్, కిషన్, జీఎంలు హేమంత్ కుమార్, ప్రభావతి, రాధిక, వసంత, శిరీష, సునీత, కల్పన, లక్ష్మి, రేష్మ, స్వాతి, మమత, వేదశ్రీ, సౌజన్య, మౌనిక, మాధవి, సాద్వి, మృదుల, స్వప్న, జ్యోతీరాణి తదితరులు పాల్గొన్నారు.



## విజయానికి తొలిమెట్టు ఆత్మవిశ్వాసమే

☐ ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళలు తమలోని ప్రతిభను గుర్తించి, ఆత్మవిశ్వాసంతో అడుగులు వేసినప్పుడే విజయం సాధ్యమవుతుందని తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ అన్నారు. ఆదివారం సాయంత్రం హనుమకొండలోని అయ్యప్ప దేవాలయం మార్గంలో గల వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణమండపంలో రోజా క్రియేషన్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సంస్థ అధ్యక్షుడు ఆలేటి శ్యామ్ సుందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఉపేందర్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిభ ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసం లేకపోతే అది వెలుగులోకి రాదని, తన సామర్థ్యాన్ని తాను నమ్మిన క్షణమే మహిళకు గెలుపు తలుపులు తెరుచుకుంటాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో సుమారు 200 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో రోజా క్రియేషన్స్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## అక్షరాయుధంతో మహిళా శక్తి చాటుతున్న 'ఇందిరా దేవి'



**వరంగల్ వాయిస్, ములుగు :** సాధారణంగా జర్నలిజం అంటేనే సవాళ్లతో కూడుకున్న రంగం. అందులోనూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పాత్రికేయ వృత్తిలో రాణించడం అరుదు. కానీ, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన పెండ్యాల ఇందిరా దేవి గత 20 ఏళ్లుగా కలం పట్టి ప్రజా సమస్యలపై గళమెత్తుతూ మహిళా లోకానికే గర్వకారణంగా నిలుస్తున్నారు. ఇందిరా దేవి గత రెండు దశాబ్దాలుగా వివిధ అగ్రశ్రేణి పత్రికల్లో పనిచేస్తూ తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. వార్త, ఇండియా న్యూస్ టుడే, నేటి ధాత్రి, ప్రజాతంత్ర, డిడి 9 వంటి దినపత్రికల్లో జిల్లా ప్రతినిధిగా సేవలందించిన ఆమె, ప్రస్తుతం 'ఆదాబ్ హైదరాబాద్' పత్రికలో ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. మహిళా జర్నలిస్ట్ అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకోవడంలో ఆమె ఎప్పుడూ ముందుంటారు. "జర్నలిజం రంగంలో మహిళలు రాణించడం గొప్ప విషయం. ఇందిరా దేవి గారు రెండు దశాబ్దాలుగా చూపుతున్న నిబద్ధత, ధైర్యం యువతకు స్ఫూర్తిదాయకమని స్థానిక ప్రముఖులు కొనియాడారు.



## ముస్త్యాలపల్లికి బస్సు సౌకర్యం

### గుంతలు పూడ్చి రోడ్డు బాగు చేయించిన సర్పంచ్

**వరంగల్ వాయిస్, నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామస్తుల చిరకాల స్వప్నమైన ఆర్టీసీ బస్సు సౌకర్యం త్వరలోనే సాకారం కానుంది. బస్సు ప్రయాణానికి ఆటంకంగా ఉన్న రోడ్డు సమస్యలను గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ తన స్వంత చొరవతో పరిష్కరించి, గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటున్నారు. చాలాకాలంగా గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, మహిళలు, రైతులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను సర్పంచ్ వెంకటేష్ పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీఎం, గ్రామాన్ని సందర్శించి బస్సు నడపడానికి రోడ్డు అనువుగా ఉండాలని సూచించారు. బస్సు ప్రయాణానికి ఆటంకంగా మారిన రోడ్డుపై ఉన్న భారీ గుంతలను సర్పంచ్ మట్టి, మొరంతో నింపి చదును చేయించారు. బస్సుకు అడ్డు తగలకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించారు.

## పశువులకు 'గాలికుంటు' టీకాలు తప్పనిసరి

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పశువులకు ప్రాణాంతకమైన గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా నివారణ టీకాలు వేయించాలని డోర్నకల్ మండల పశువైద్యాధికారి డాక్టర్ పి. నాగేశ్వర రావు రైతులకు సూచించారు. మండలవ్యాప్తంగా ఈ నెల 10 (మంగళవారం) నుంచి ఏప్రిల్ 9 వరకు నిర్వహించనున్న గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వర రావు మాట్లాడుతూ.. మూడు నెలల వయస్సు నిండిన ప్రతి పశువుకు ఈ టీకా వేయించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి సోకితే పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని, దూడలు మృతి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 10న అమ్మపాలెం, 13 ఉయ్యాలవాడ, 18 గుర్రాలకుంట తండా, 23 చిల్కోడు,28 పెరుమండ్ల సంకీసా,ఏప్రిల్ 10న బుర్గుపాడు,3 గోలచర్ల,8 డోర్నకల్ రెవెన్యూ గ్రామాల వారి షెడ్యూల్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట మూల మలుపు వద్ద రోడ్డు విస్తరణ చేయాలి
- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ – కరీంనగర్ ప్రధాన జాతీయ రహదారిపై హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. సోమవారం ఆమె నేషనల్ హైవేస్, ఆర్ అండ్ బీ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి ప్రమాదకరంగా మారిన 'బ్లాక్ స్పాట్స్'ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, హసన్‌పర్తి చెరువు కట్ట వద్ద జరుగుతున్న ప్రాణనష్టంపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్, సోమవారం అధికారులతో కలిసి స్వయంగా పరిశీలన జరిపారు. పరిశీలన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రమాదకరమైన మలుపు వద్ద రోడ్డు విస్తరణ చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు.

దీనివల్ల ప్రమాదాల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణకు సంబంధించి ఆర్ అండ్ బి, సాగునీటి పారుదల మరియు మున్సిపల్ శాఖలు సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తక్షణమే హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు మరియు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ పర్యటనలో నేషనల్ హైవేస్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, తహసీల్దార్ కిరణ్ కుమార్, పోలీస్ ఇన్స్పెక్టర్ చేరాలు, సాగునీటి పారుదల మరియు మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే - సామాజిక విప్లవ మాతృమూర్తి



భారతదేశ చరిత్రలో మహిళా విద్య, సామాజిక సమానత్వం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులలో సావిత్రిబాయి పూలే పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. పితృస్వామ్య వ్యవస్థ, అంటరానితనం వేళ్లూనుకున్న కాలంలో చదువు ద్వారానే విముక్తి సాధ్యమని నమ్మి, ఆచరణలో చూపిన తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు ఆమె. 1831 జనవరి 3న మహారాష్ట్రలోని నయాగావ్‌లో జన్మించిన సావిత్రిబాయికి చిన్నతనంలోనే మహాత్మా జ్యోతిరావు పూలేతో వివాహం జరిగింది. అక్షరం ముక్క రాని ఆమెకు భర్త జ్యోతిరావు పూలే స్వయంగా ఓనమాలు నేర్పించారు. చదువు నేర్చుకున్న సావిత్రిబాయి కేవలం తనకే పరిమితం కాకుండా, సమాజంలోని అణగారిన వర్గాల కోసం అక్షర యజ్ఞాన్ని ప్రారంభించారు.

### అక్షర యుద్ధం - అవమానాలపై విజయం

1848లో పూలే దంపతులు దేశంలోనే తొలి బాలికల పాఠశాలను ప్రారంభించి చరిత్ర సృష్టించారు. నాటి సమాజంలోని ఛాందసవాదులు ఆమెపై రాళ్లు, బురద, పేడ విసిరి అవమానించేవారు. అయినప్పటికీ ఆమె వెనుకడుగు వేయలేదు. తన వెంట ఒక అదనపు చీరను తీసుకెళ్తూ, బురద చిందిన చీరను మార్చుకుని మరీ పిల్లలకు పాఠాలు నేర్పేవారు. ఆమె పట్టుదల ఫలితంగానే కేవలం నాలుగేళ్లలో సుమారు 20 పాఠశాలలు వెలిశాయి.

### సామాజిక సంస్కర్తగా..

కేవలం విద్యకే పరిమితం కాకుండా, సావిత్రిబాయి అనేక అమానుష ఆచారాలకు వ్యతిరేకంగా పోరాడారు. విధవల కోసం ఆశ్రయ గృహాలు ఏర్పాటు చేయడమే కాకుండా, వితంతువు కుమారుడు యశ్వంతరావును దత్తత తీసుకుని సమానత్వానికి నిదర్శనంగా నిలిచారు. అంటరానివారికి తమ ఇంటి బావినే తెరిచి ఉంచి సామాజిక విప్లవానికి నాంది పలికారు. 1897లో పూణేలో ప్లేగ్ వ్యాధి ప్రబలినప్పుడు రోగులకు సేవ చేస్తూ, అదే వ్యాధి సోకి 1897 మార్చి 10న ఆమె తుదిశ్వాస విడిచారు.

### నేటి తరానికి స్ఫూర్తి..

సావిత్రిబాయి పూలే చేసిన కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం తపాలా బిళ్లలు విడుదల చేయడమే కాకుండా, అనేక విశ్వవిద్యాలయాలకు ఆమె పేరు పెట్టింది. నేడు దేశంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే, దానికి నాడు సావిత్రిబాయి వేసిన పునాదులే కారణం. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి.



- డాక్టర్ డి.శ్రీనివాస్
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ
ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహదేవ్ పూర్,
జయశంకర్ భూపాలపల్లి జిల్లా



## వరంగల్ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక నజర్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ నగర అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. కేంద్ర పథకం 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించడాన్ని స్వాగతిస్తూ, సోమవారం వరంగల్ మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రూ. 5257.20 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు రావడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, కార్పొరేటర్ గందె కల్పనా నవీన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, బైరి నాగరాజు, వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**వరంగల్ వాయిస్, ఇనుగుర్తి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇనుగుర్తి మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ రూపా రాణి ఆధ్వర్యంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వ పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూల మొక్కలు అందించి వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సూరం భాస్కర్ రెడ్డి, టీపీటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, ఉపేందర్, టీయూపీఎస్ మండల అధ్యక్షుడు సామల రమేష్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బానోతు వీరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యసాధనే ధ్యేయంగా చదవాలి

☐ జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను ఒక సవాలుగా తీసుకుని, ముందస్తు ప్రణాళికతో చదివి అత్యధిక మార్కులు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఆన్‌లైన్ మోటివేషన్ సెషన్‌ను డీఈఓ స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వెంట మండల విద్యాధికారి డాక్టర్ రాష్ధన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# వరంగల్ ముఖచిత్రాన్ని మార్చే ప్రాజెక్ట్ యూజీడీ

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ. 5,257 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతి
- బాణసంచా పేల్చి కాంగ్రెస్ సంబరాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా మౌలిక సదుపాయాల చరిత్రలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) అత్యంత కీలకమైన, అతిపెద్ద ప్రాజెక్ట్ అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. వరంగల్ నగరాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇచ్చిన మాట ప్రకారం రూ. 5,257.20 కోట్ల నిధులను కేటాయిస్తూ జీఓ నంబర్ 322 ద్వారా పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే మామునూరు విమానాశ్రయం కోసం రూ. 309 కోట్ల భూసేకరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కొత్త మాస్టర్ ప్లాన్ వంటి భారీ ప్రాజెక్టులను పట్టాలెక్కించామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు జరుగుతుంటే ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. "ఊర్లో పెళ్లికి కుక్కల అరుపులు" అన్నట్లుగా వారి వ్యాఖ్యలు ఉన్నాయని, తాము పనులు ప్రారంభిస్తుంటే ఇతర పార్టీలు పాలాభిషేకాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. వరంగల్ త్రినగరి ప్రజల దశాబ్దాల కలను నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేస్తామని, అభివృద్ధిపై చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఇంతటి భారీ నిధులు కేటాయించిన ముఖ్యమంత్రికి, మంత్రులకు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. యూజీడీ ప్రాజెక్టుకు నిధులు మంజూరైన నేపథ్యంలో హనుమకొండలోని కాంగ్రెస్ భవన్ ఎదుట పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com